# దేవుడుచూడని కథ

మనూళ్ళో ఆకాశం వుంది.... మనూళ్ళో పగలు సూర్యుడూ, రాత్రి చంద్రుడూ వుంటారు.... మనూళ్ళో కష్టా లున్నాయి.... సుఖా లున్నాయి.... మనుషులున్నారు.... మనూళ్ళోనే చిరునవ్వులున్నాయి.... కన్నీళ్ళున్నాయి.... పెడ బొబ్బలున్నాయి.... అట్టహాసాలున్నాయి.... పెను ఏడుపులున్నాయి.... అలాగే—

కొన్నాళ్ళక్రితం ఓ మోస్తరుగా వుండి, ఇప్పుడు విపరీతంగా (బియ్యం కంట్రోల్లా) నాగరికత పెరిగిపోయిన మనూరి మధ్య దేవేంద్ర భవనాల్లాటి మేడల్తోబాటు, మనంచూస్తే కడుపులో దేవినట్టుండేగుడిసెలు కూడా వున్నాయి. కాస్త ఓపికపట్టి అలా గుడిసెల పక్కగా నడిచివెళ్తే, నాలుగో వరుసలో తొమ్మిదో గుడిసెనుంచికాబోలు.... ఓ సన్నని రాగం మధ్య మధ్య ఎక్కిళ్ళతో వినిపిస్తుంది. ఆ ఏడుపు దూరంగావున్న శ్మశానంలోంచి ఏదో ప్రేతాత్మ అరుస్తున్నట్టుంది. ఇప్పటిదాకా సృష్టిలో వున్న విచారాన్నంతటినీ తనలో నింపుకుని, కన్నీళ్ళన్నీ ఖర్చయ్యేక, అప్రయత్నంగా గాల్లో కలిసిపోతున్న ఆ యేడుపు అతి ఘోరంగానూ, ఏ మూలన్నా జాలి దాగుంటే అది ఒక్కసారిగా ఒలికి పోయేట్టు అతి దీనంగానూ, వుంది.

ఇంకొంచెం ఓపికపట్టి అలా తొంగిచూస్తే, ఆ గుడిసంతా పూర్తిగా కనిపిస్తుంది. అందులో గోడలు నల్లగా మాసిపోయి, తెగమాసిపోయున్నాయి. పొగచూరిన ఆ నేలా, ఆ గోడలూ, అన్నీ నల్లగా

అతి అసహ్యంగానూ ఉన్నాయి. గోడ మీద వై జయంతిమాల, జవహర్‌లాల్‌నెహ్రూగారూ కాగితాలమీద వేళ్ళాట్టంలేదు. ఒక చోటమాత్రం చిన్న అరలో ఓ దేవుడి విగ్రహం, ఎన్నో యుగాలనుంచీ వున్నట్లు అక్కడే వుంది. కాస్తంత మసిబారి, ఇంకొంచెం మాసిపోయి,— ఆ గుడిసెలో వున్నట్టే, వుంచదగ్గట్టే వుంది. ఆ విగ్రహంలో కళ్ళుమాత్రం ఈ కష్టాలింక చూడలేవన్నట్టు కాస్త చిట్లించుకున్నట్టున్నాయి.

అక్కణ్నించి కొంచెం కింద చూస్తే, పొగచూరినగోడకి బాగా కిందుగా భూమ్మీద, నిరాశతో చేసినట్టున్న నులకమంచం వుంది. ఆ మంచంమీద వో నానవాకారం వుంది. పడుక్కుని కనిపిస్తుంది— జాగ్రత్తగా చూస్తే ఆ ఆకారంలో దాదాపు యాభయ్యేళ్ళ వయసూ, కష్టాల్లోనూ, దరిద్రంలోనూ మునిగిపోయి, ఇంక తేడాని కవకాశంలేక అలానే వుండిపోయిన మనసు నీడ మొహంమీద స్పష్టంగా కనిపిస్తాయి. ఓ రెండు గాజు గడ్లలావున్న కళ్ళుమాత్రం దీనంగా, అతి దీనంగా, ఘోరంగా, అతిఘోరంగా, దూరంగా, అతిదూరంగా, చూస్తున్నట్టున్నాయి. కాని జాగ్రత్తగా చూస్తే, అవిమాత్రం మసిబారిన గోడమీద పూర్తిగా మసిబారని దేవుడి విగ్రహం పాదాలవైపు చూస్తున్నట్టు తెలుస్తుంది. సన్నగావున్న ఎముకల్ని దరిద్రంతోనూ, అక్కడక్కడ వికృతంగా వంగిపోయినమాంసపుముద్దల్ని నిరాశతోనూ కలిపివేసినట్లున్న ఆశరీరాన్ని చూస్తే, నరకంలో సగం శిక్షనుభవించి, పొరపాటున భూమికి జారిపోయిన 'గతప్రాణి'లా వుందేగాని, 'ప్రాణి'లా లేనేలేదు.

ఆ ఆకారం పక్కనే వో పద్దెందేళ్ళమ్మాయి— ఇంకా కన్నీళ్ళు పూర్తిగా ఇంకి పోక పోవడంవల్ల చాలా ఏడ్చి ఏడ్చిసొమ్మసిల్లినట్టుంది. అందుకు గుర్తుగా ఆమె బుగ్గలమీద చారలు కట్టిన కన్నీటి గుర్తులు కష్టాల్నించి చాపుకివేసిన దారిలాగ, వికృతంగా, అందంగా, భయంకరంగా, సున్నితంగా ఆమె కళ్ళనించి జారి, బుగ్గలమీదుగా పాకి, మెడమీదుగా బాగా చిరిగిన జాకెట్టు నోదార్చి, అక్కడే సొమ్మసిల్లేయి— కాస్సేపు గడిచేక ఆ అమ్మాయికి తెలివొచ్చింది. తెలివితోబాటు, గాభరా.

భయం వచ్చేయి. మళ్ళీ అనుకోకుండా కన్నీళ్ళొచ్చేయి. ఇంకిపోయిన చెరువులోకి ఓ పెద్ద బండరాయేస్తే ఆఖరికి మిగిలిపోయిన కాస్తంత నీరూ పైకి తుళ్ళినట్టు, ఆమెలో మిగిలిన కాస్త కన్నీరు బైటకొచ్చేసింది. వాటితోనే కళ్ళలో ఎర్రని ఎరుపొచ్చింది. ఎక్కిళ్ళొచ్చేయి.... మళ్ళీ ఇందాక దరమాసుపత్రి డాక్టరుబాబు చెప్పింది జ్ఞాపకవొచ్చింది. అందువల్ల మళ్ళీ గుండెల్లో బరువు, గుండెచుట్టూ భయం, నాటుకొని, ఎదిగి ఒక్కసారిగా పొంగేయి.

ఇందాక తనేటి సేసింది? దరమాసుపత్రికి తల్లి గ్రిచ్చా మీద లాక్కెళ్ళింది. దాన్నోరండాలో వొదేసి, తనెల్లి డాక్టరుబాబు కాళ్ళమీద పడింది, పడి,

"డాక్టరుబాబూ! నా తల్లి.... అది బైట కూలబడిపోనాది. దానికి మీరు పేనం పొయ్యాల. మీ కాల్లట్టుకుంటాను" అంది.

అప్పు డేటన్నాడ్డాక్టరుబాబు? యేటన్నాడు?

"అదేదో ఇంజీసనియ్యాల. అదైదు రూపాయొద్ది.... అదిస్తేనే నీతల్లి బతుకుద్ది. యేటి? అర్థవైందా?" అన్నాడు డాక్టరుబాబు తల్లి న్చూసేక.

"మరైతే డాక్టరుబాబూ! ఇంజీస నెప్పుడివ్వాల?" అంది.

"రాత్రి తప్పితే, రేపొద్దున్న"

"మరైతే ఎల్లిరానా? నా తల్లిని బతికిస్తావా?"

"ఊఁ! ఊఁ!"

ఆతర్వాత ఆ పద్దెందేళ్ళూ, ఎర్రనికళ్ళూ వుండి.... ఆ పద్దెందేళ్ళపాటు ఎర్రని కళ్ళతో ఎప్పుడూ సాధారణంగా యేడవక పోవడం లేని ఆ అమ్మాయి— 'నాగులు' తల్లిని గుడిసెకి తీసొకొచ్చింది. తీసొకొచ్చి గుడిసంతా వెతికింది. ఇంట్లో కూ డేమ్నేదు! కాన్దమ్మకూడా లేదు. అమ్మ కారోగ్గం నేదు. గుండెల్లో భయంతప్ప మరేమ్నేదు! గుడిసెలో సీకటిగాని ఇంకేమ్నేదు.

మరున్నదేటి?

"యెంకటీస్వరుడి బొమ్మ."

"ఐతే ఐదు రూపాయలు? జౌనౌ నదే కదూ! అదే కదూ! అదే!"

అప్పణ్ణాగులు తల్లిని మంచంమీద పడుకోబెట్టి రిచ్చా యెంకణ్ణి 'డబుల్తరువాతిస్తా' నన్చెప్పి పంపించేసి, గుడిసెలో ఆ 'యెంకడి' బొమ్మ కాడికెళ్ళి, చేతుల్జోడించి "బగంతుడా! ఇదేట్నాకీ పరీచ్చ? అది.... మా యమ్మ.... ఒట్టెర్రిబాగుల్ది. అత్తెచ్చి నన్నాఖ్ఖా నా కుక్కాదెట్టింది. వున్నంతలో సీరలు కొంది. బైస్కోపుల్చూపిచ్చినాది. నిన్ను పేనంగా చూసిన్ది. కాని, ఇప్పుడది డౌనైపోన్ది. దానికీ జబ్బుచేసిన్ది.... నీకు తెలుసు గందా? సెట్టిగారింట్లోనూ, పంతులుగారి మేళ్ళోనూ, రెడ్డిగారి బౌవంతిలోనూ, ఇంకా మిగతా యిల్లల్లోనూ నేనే యెల్లి పన్జేస్తునాను. ఐతే.... నాకేవీ బాదనేదు. కాని.... మాయమ్మ, అదిప్పు డైదురూపాయ ల్నేకపోతే సచ్చిపోద్ది. అంచేత ఆ ఐదురూపాయలూ నాను తేవాల?! అది సత్తే నాను బతికలేను. అంచేత ఆ డబ్బు దొరికేట్టుచెయ్యి బగంతుడా? మా బీదపేనాల్ని రచ్చించు." అని చాలా దీనంగానూ, జాలిగానూ ప్రార్థించింది నాగులు. అలా ప్రార్థించేక ఆమె ముందుగాపంతులు గారింటికి పరిగెత్తింది.

పంతులుగారిల్లు నాగులింటికి మరీ దూరంకాదు. అంచేతామె చాలా జోరుగా పరుగెత్తి చాలా కొద్దిసేపట్లో పంతులుగారిల్లుచేరింది. "పంతులు బాబుగోరూ" అని గట్టిగా వొగిరుస్తూ రెండుమార్లు పిలిచింది. పంతులుగారు పలకలేదు.

"ఏంవేఁ" అంటూ పంతులమ్మగారు బైటికొచ్చేరు. వచ్చి నాగుల్ని చూసి "నువ్వాజే" అని ఆశ్చర్యపోయేరు. బాగా డబ్బున్న కుటుంబాల్లో ఆవిడ దొకటవటం వల్ల ఆవిడకి నాగుల్లాంటి మనుషులంటే చాలా అసహ్యం, నిర్లక్ష్యమూను. అందువల్ల ఆవిడ ఆశ్చర్యపోవడ మవగానే "యేవిఁటా అరుపులు? ముదనష్టప్ముండా! ఇవాళ్ళంతా యేఁవయ్యేవ్? అంట్లెవరు తోపుతారే? నీ తాతా? మీ అమ్మ చూస్తే జ్వరవఁన్చెప్పి (దొంగముండ) ఇంట్లో పడుంది! నువ్వు చూస్తే ఇలా గొట్టేస్తావు! యేవిఁట్రా దొంగముండల్లారా, మీ వుద్దేశాలు? నెలా అయ్యేసరికి

మాత్రం ఐదు కరుకులు— ఒకటీ రెండూ కాదు; ఐదు కరుకుల్లాంటి రూపాయలు మాత్రం చేతిలో పొయ్యాలి? యేవిటీ ఇలా ఐతే వెంటనే వెళ్ళిపో. మళ్ళీ కనిపించకు. అః! చనువిస్తే నెత్తికెక్కుతారే మీరు. పద! అంట్లు తోపు! పొద్దున్నుంచి తుడవని గదులన్నీ తుడూ!" అని చాలా కోపంగా అని, ఇంకాకోపంగా "హుఁ" అని హుంకరించిందావిడ. అప్పుడావిడ కళ్ళు పొడుగ్గానూ, వెడల్పుగానూ సాగేయి. అలసటవల్ల కలిగిన చెమటవల్ల ఆవిడ నుదుటిమీది పావలా కాసంత కుంకంబొట్టు కదిలి, చెదిరి అర్ధరూపాయంతైంది— ఆవిడ క్కోపం వస్తే, మాత్రం మనిషికాదు (రాక్షసాలా? మరేంటీ?) ఆవిడ కోపప్రహోయలో యేమైనా చెయ్యగల్దు. కోపంగా లేనప్పుడావిడ మొగుణ్ని చిటికిన వేల్తో ఆడించ గలదు. కోపంవస్తే, ఆవిణ్నిచూస్తే చాలు, ఆయనే ఆడతాడు.

ఈ గోలంతావిని- సింహంగారు పంచాయితీచేస్తూ లేపని కోప్పడు తున్నప్పుడు, ఆ కేకలవిని నిద్దర్లేచి గబగబా వొళ్ళు విరుచుకొని బైటి కొచ్చిన అసిస్టెంట్ నక్కలాగా— పంతులుగారైన పంతులమ్మ భర్త గారు ఆవలిస్తూ బైటికొచ్చేరు. భార్య స్వరూపం చూడగానే ఆయనకి ఆవలింతా, నవాళ్లూ ఆగిపోయేయి. ఐనా ఎదురుగా మరో ఆవదుం డడంవల్ల ఆయన భయాన్ని కాస్త కంట్రోలు చేసుకొని, నక్క సింహాన్ని అడిగినట్టే, వినయావినయంగా "ఏం సింహాలూ! ఏవైంది" అనడిగేరు.

అప్పుడు 'సింహాద్రమ్మ' అనబడే పంతులమ్మగారు పంతులుగారి పక్క తిరిగి, "ఏవైందా?" అనగేరు. అలా అన్నప్పుడావిడకంఠంలో కోపాన్నీ, వెటకారాన్నీ గమ్మత్తుగా 'మిక్స్' చేసేరు. ఆ తరువాత నడుంకి రెండు వైపులా చేతులుంచుకుని ఏవైందో చెప్పేరు. చెప్పి "చూసేరా దొంగముండ" అన్నారు.

"చూసేను" అని పంతులుగారు చిన్నగా నవ్వేరు.

"హుఁ" అని పంతులమ్మగారు మళ్ళీ హుంకరించారు.

ఆ తరువాత ఓ రెండు సెకండ్లు పంతులమ్మగా రూపిరి తీసు కున్నారు. ఆ వ్యవధిలోనే నాగులు తేరుకొని, చెప్పగలిగినంతలో

వాళ్ళమ్మ పరిస్థితి చెప్పి, ఐదు రూపాయలండమ్మగోరూ! మీ కాళ్లట్టు కుంటాను. సచ్చి మీ కడుపున పుడతాను. ఆ సూదిమందిత్తే కాని మా యమ్మ బతకదట. దాని పేనం దక్కించండమ్మా" అని చాలా దీనంగా వేడుకుంది నాగులు. ఇలా అంటున్నప్పుడామె, కళ్ళలో నీళ్ళు నిండేయి. మనసులో భయం, ఆత్రుత కలిసి పొంగేయి. అలా అన్నాక ఆమె అక్కడే పంతులమ్మగారి పాదాల దగ్గిర కూలబడింది.

అప్పుడు పంతులమ్మగారికి 'దరిద్రమ్ముండ' 'వెధవ్వేషాలు' మితి మీరుతున్నందుకు చాలా కోపంవచ్చింది. అందువల్లావిడ దూరంగా జరిగి పంతులుగారితో "చూసేరా? దొంగ వెధవ్వేషాలు.... పన్జేయడం మానీ దవేఁ కాదట! ఐదు రూపాయలివ్వాల్ట! అఁ!" అన్నారు. అందుకు జవాబుగా పంతులుగారు "అఁ! అఁ! అఁ!" అని- మృగరాజు "నేన్తప్ప మిగతా జంతువులన్నీ దద్దమ్మలు" అన్న స్టేట్మెంట్కి నక్క తలూపి నట్టూపేరు. తలడ్డంగా తిప్పటం ఆయన (వైవాహి ) జీవితంలో లేనే లేదు....

ఆవిడ చిరుతపులైతే ఈయన పులిదగ్గ రసిస్టెంటు పిల్లి. ఆవిడ డైనమేటైతే ఈయన ఎప్పుడూ డైనమేటువల్ల ఎగిరిపోయే ఎక్కడుండే రాతి ముక్క.

మరి కాసేపేడ్చి అవసరాన్నిచెప్పినా, నాగులి తిట్లూ, శాపాలూ, పోయిన్నౌకరీ తప్ప మరేం దక్కలేదు. అందువల్ల నాగులు బైటికొచ్చి సెట్టిగారింటివేపు పరిగెత్తింది....

పనిలోకి రానందుకు మామూలు తిట్లన్నీ తిన్నాక, మళ్ళీ నాగులు మనసుకీ, ఆశనీ మామూలు చీకటే ముసిరింది....

సెట్టిగారిల్లు బంగారబ్బోను. ఆయన భార్య చుంచెలక. ఆయనో ఎలక. పంజరంచుట్టూ పకడ్బందీగా దానం, వుపకారం లాటి పురుగులు వాలకుండా కరెంటు.

తిట్లూ, కన్నీళ్ళు తప్ప మరేవీఁ మిగల న్నాగులు బైటికొచ్చి "పంతులుగారే నయం" అనుకుంది.

ఆ తర్వాతామెకి కన్నీళ్ళు రాలేదు. అమ్మ జ్ఞాపకవొచ్చింది. అమ్మకెలాగుందోనని ఆమె చాలా బెంగ పెటుకుంది. కాని ఐదు రూపా యల్లేందే, ఎలాగా ?.... ఎలాగా ? నాగులు మనసంతా మసిపూసినట్లైంది. తప్పదు. ఎల్లాలి...."అందరిపాదాలు పట్టాల మరి" నేకుంటే.... అమ్మ.... ఐదురూపాయలు....

* * *

రెడ్డి మంచివాడు కాదు. కాని విపరీతంగా డబ్బున్నవాడు. అందు వల్ల అతను కాస్త నిక్కచ్చిగా వుండేమనిషి. కాని మంచివాడు. "కాక పోవడమేవిఁటి సార్ ?"

నిఖార్సయిన విషానెండబెట్టి, దానికి పాలిష్కొట్టి, హిట్లర్ మీసాలు తగిలించి, నూరో నెంబరు నూలు పంచె, ఖద్దర్లాల్చీవేసి చేతికి ఓ కర్రఇస్తే — అది రెడ్డౌతుంది.

అతని కళ్ళు రెండూ, నిప్పుదగ్గర రెండుమిణుగురుల్లామెరుస్తాయి. అతనోరు అతి అందమైన కాలనాగు చిన్నగా చుట్టు కున్నట్టుంటుంది. అతను మాటిమాటికీ ఆ పెదవుల్ని నాలికతో తడుపుతుండటంవల్ల, ఆ నాలిక పామునాలికలాగేవుంటుంది. ఐనాఅతనిపెదవులు చాలాగంభీరంగా, ముడుచుకుపోయి కలుసుకున్న రెండు జర్రిపోతుల్లా వుంటాయి. అతను మాట్లాడుతూంటే—ఓ నాగుపామూ, రెండు జెర్రిపోతూలూ మన పక్క చూసి బుసకొట్టినట్టుంటుంది.

అతని చూపులు చాలా భీకరంగా— యమలోకంలో పాపుల్ని నిప్పుల్లోకి తోస్తున్న యమదూత కళ్ళు ఆ మంటల్లో మెరిసినట్టు, అతి గానూ, అతి భయంకరంగానూ, మెరుస్తాయి. (అస్కాలు కాదు. రెడ్డి గార్కి పెర్కిట్టుంది.) అతని చూపులు మొదట కళ్ళని ఛేదించి: ఆ తర్వాత మెదణ్ణి ఛేదించి, ఒక్కసారి కపాలాన్ని బద్దలుగొట్టి బైటికి జారిపోయినట్టుంటాయి. అందువల్ల అవి—పెనుపాము, దెబ్బతిన్న పులి.

దేవుఁడితో దెబ్బలాడి కేయాస్లోకి జారిపోయిన శాటన్, కొడుకు మరణ వార్తవిని మళ్ళీ రాముణ్ణి తలుచుకున్న రావణాసురుడు, తన మేన ల్లుడింకా బతికే వున్నాడని అప్పుడే తెలిసిన కంసుడు, వీటన్నిటి, వీళ్ళం

దరి కళ్ళనీ ముద్దగా కలిపి, సరాసరి కట్టి, తీసిన భాగంలో యింత విషం పోసి తగిలించినట్టు, అవి అతి భయంకరమైన పెనుభూతపు కళ్ళలా వుంటాయిగాని, మనిషికళ్ళలా వుండనే వుండవ్.

రెడ్డి బ్రహ్మచారి కాదు. అతనికి నలుగురో, ఎందరో పెళ్ళాలు అఫీషియల్‌గానూ, ఇంకొందరు అనఫిషియల్‌గానూ, (అందరివీ వేరు వేరిళ్ళే! రెడ్డిగారేవిఁ దానకర్ణుల్సార్?) వున్నారు. రెడ్డికి వీళ్ళేకాక బోల్డు బేంకెకౌంటూ, తాతల్నాటి ఖ్యాతి, బోలెడంత, బంగారం (గోల్డు బాండ్స్ కివ్వన్ది) కూడా వున్నాయి. అంచేతతనికి సాధారణంగా కోపం రాదు. అతని పెదవు లెప్పుడైనా ఖాళీగా వుంటే అవి నవ్వుతూనే వుంటాయి కానీ, కోపంగా వుండవ్.

కాని....రెడ్డిగారీ వేళ చాలా కోపంగా వున్నారు. ఆర్నెల్లక్రితం ఐదు వేలిచ్చి కొనుక్కున్న 'చంద్రవదన'తో ఆయన్నలా కోపంగా మాట్లాడు తున్నారు.

ముందు రాత్రాయనా, చంద్రవదనా కలిసి, అంతందమైన డిన్నర్ తిన్నారా! పని మనిషి ముండ చూస్తే రాలేదు. మరీ బిర్యానీ ప్లేట్లు, విస్కీ గ్లాసులూ, యివన్నీ "ఎవరు, కడుగుతారు? హూ ది హెల్ విల్ వాష్? ఆ పని మనిషి రానీ! రాటెన్ బిచ్." అని కోపంగా విసుక్కున్నాడు రెడ్డి.

సరిగ్గా అదే సమయానికి "బాబూగోరూ" అన్న నీరసమైన కేక రెడ్డికి వినబళ్ళేదుగాని 'చంద్రవద'నకి వినపడింది. అప్పుడావిడ "యువర్ రాటెన్ బిచ్ హేజ్ కమ్-ఇట్ సీమ్స్" అంది. అని నవ్వింది.

రెడ్డి నవ్వలేదు. "ఏదీ? ఎక్కడ" అంటూ చేతిలో సిగార్ నేల కేసి కొట్టి గబగబా వరండాలోకి నడిచేడు. అక్కడ నాగుల్ని చూడగానే అప్పుడే కొట్టిన సోడాలాగ అతను పొంగేడు. నాగుల్ని బూతు లిట్టి "ఏవేఁ? ఎక్కడ చచ్చావే?" అని చాలా కోపంగా గద్దించడిగాడతను.

అప్పుణ్ణాగులేఁవీఁ మాటాడలేదు. వరండా మీద కూర్చుంకిపో యింది. అప్పటికామెచాలా ఇళ్ళుతిరిగింది.చాలా కన్నీళ్ళు కార్చింది. చాలా సార్లు దేవుడిమీద విసుక్కుంది. చాలాసార్లు నిట్టూర్చింది. చాలాసార్లు

అమ్మ గురించి భయపడింది. చాలాసార్లు మళ్ళీ దేవుణ్ణి తలుచుకొని ధైర్యం తెచ్చుకుంది. అందువల్ల ఆమె చాలా అలిసిపోయింది. చాలా దీనంగా రెడ్డిగారి 'బొవంతి' వరండా మీద వాలిపోయింది.

అప్పుడు రెడ్డి సడెన్‌గా గాస్ తగ్గిన సోడాబుడ్డిలా తగ్గిపోయేడు. అక్కడక్కడ చిరిగిన నాగులు జాకెట్టువేపు పాకటంగా చూసేడు. ఓ ఐదారు సెకండ్లలా చూసి,

"ఏం నాగులూ! పొద్దున్నెందుకు రాలేదు? మీ అమ్మకెలాగుంది?" అని వీలైనంత సున్నితంగా అడిగాడు.

అప్పుణ్ణాగులు చాలా ఆశ్చర్యంగా తలెత్తింది. అడవిలో వొంటరిగా వున్నప్పుడు మీదకి పులి కోరలు తెరుచుకొని వస్తున్నప్పుడు- బతుకు మీదాశొదిలేసి, కళ్ళు మూసుకొని, చావు కోసం, అతి భయంగా, అతి ఘోరంగా, అతి దీనంగా చేతులూ, మనసూ చాచినప్పుడు ఒక్కసారి, ఒక్కసారిగా— మనవలాగే వుండిపోతే, కళ్ళు తెరిచ్చూస్తే. మన చేతిమీదో, బుగ్గ మీదో ఆ పులి. మన పెంపుడు కుక్కలా, సున్నితంగా, మెత్తగా విశ్వాసంగా నాకినప్పుడు, మస కాశ్చర్యం కలిగినట్టు, రెడ్డి ప్రవర్తన చూసి నాగులికి చాలా ఆశ్చర్యం వేసింది. అప్పుడామె చాలా ఆతృతగానూ, ఆశగానూ రెడ్డితో పరిస్థితంతా చెప్పింది. చెప్పి, "రెడ్డి బాబూ! నీ కాళ్లట్టుకుంటా న్నండి! నా యమ్మని కాపాడు బాబూ!" అని కన్నీళ్ళతో అని కాళ్ళు పట్టుకో బోయింది.

రెడ్డి వెనక్కి జరిగిపోయేడు. చిన్నగా నవ్వి, "యీపాటి దానికి కాళ్ళు పట్టుకోవాలా నాగులూ? ఐదు రూపాయలేం ఖర్మ? ఐదొందలిస్తాను." అన్నాడు.

గొప్పవాళ్ళలో కొందరికి ఎలాటప్పుడెలాటి కోరికలు పుడతాయో చెప్పడం కష్టం. మూడైదులు సిగరెట్టుకాల్చే ఆయనకి, సడన్‌గా మూడు గుర్రాల బీడీ కాల్చాలనిపించొచ్చు. షాంపేన్ రోజూ తాగే ఆయనకి, సారాతో కుంకుడుకాయ పులుసు కలిపి తాగాలనిపించొచ్చు.

అలాగే అంతటి రెడ్డికి సడన్‌గా నాగుల్ని ఆమె చిరిగిన జాకెట్టునీ చూసి, చాలా వింతైన కోరిక కలిగింది. ఒక్క రాత్రికి సైయ్యంటే "ఏదొందల్నివే!" అన్చెప్పి ఠీవిగా సిగార్ ముట్టించేడతను.

నాగులికొంచెం సేపయాక రెడ్డేవన్నాడో అర్థమైంది. ఒక్కసారిగా ఆమె మీదకి పాములెన్నో దూకినట్టు, అవి కోరల్తో గుండెల్ని పీకేసినట్టూ ఒక్కసారి ఎన్నో మంటలు చుట్టుముడితే, వాటి సెగల్లో మనసు కాలిపోతున్నట్టూ ఆమెకు అనిపించింది.

వెంటనే మొహాన్ని వీలైనంత భయంగా పెట్టి, చిరుతనూ సిన చిరుతొంకలాగా— అ క్కడ్నుంచి తడబడుతూ, పరిగెడుతూ వచ్చేసింది.

అలా రోడ్డు మీదికొచ్చేసిన్నాగులు వొగరుస్తూ వో చోటాగిపోయింది. అప్పుడామె చుట్టూ మ్యునిసిపల్ వెలుగుంది. ఆమె కెదురుగా సగం తలుపులు మూసిన మందుల్షాపుంది. అప్పుడామె కంగారుగా ఆ షాపు దగ్గిరికెళ్ళి "బాబూ! దుకానం మూసేస్తన్నా?" అనడిగింది.

ఆ షాపాయన, "లేదు లేదు! వుంటుందిలే! వేగిరం రా!" అన్నాడు. అప్పుణ్నాగులి కేమనిపించిందంటే,"అమ్మ 'పేనం' కోసం— అందువల్ల మందుకోసం చాలా వేగం ప్రయత్నించాలి." అనిపించింది.

కాని....వొంట్లో నీరసం తప్ప వోపిక లేదు. నిరాశ తప్ప, ఆశే లేదు. కంట్లో నీళ్ళ (అవీ ఐపోవచ్చేయి.) తప్ప ధైర్యం లేదు.

మరెలా? మరెలా?

షాపు దగ్గర్నుంచి నాగులొచ్చేసింది. వచ్చి ఫుట్‌పాత్మీద కూలబడింది. అలా కూలబడ్డాక ఆమెక్కళ్లంట నీళ్ళొచ్చేయి. ఆ తరువాత కళ్ళ మీదకి, నీరసం వల్ల చిన్న కునుకులాటి దొచ్చింది. మరికొంచెం సేపయాక తెలివీ, ఏడుపూ వచ్చేయి. కాస్సేపు మాత్రమే ఆలోచించ గల్గిన్నాగులు మరాలోచించలేక,రెడ్డింటివైపు పరిగెత్తింది.

* * * *

"రెడ్డిగోరి బొవంతి" దగ్గిర కొచ్చిన్నాగులు మళ్ళీ కూలబడిపోయింది. ఎందుకంటే— అప్పుడే రెడ్డిగారు ఫుల్ డ్రెస్‌లో కారు బేక్

డోర్ లోపల 'అమ్మగారి' వైపు చూసి నవ్వి, మళ్ళీ ఫ్రంట్ డోరు వైపు వెళ్ళి, కార్ని 'అమ్మగారి' నవ్వులా మెత్తగా పరిగెత్తించేసేరు.

*　　　*　　　*

సార్ మేడమ్—మీ మూడెలా వుంది? మీ మనసెలాగైంది? నాగులి గురించి మీరు ఎక్కువక్కర్లేదు. ఒక్క నిముషం— ఒక్క నిముషం చాలు— ఆలోచించి, ఆమేం చెయ్యాలో చెప్పగలరా? చెప్ప లేరు. మీరివ్వగలిగిన మేక్సిమమ్ కన్సొలేషన్—ఒక చల్లని నిట్టూర్పు.

కాని, నాగులు పరిస్థితి వేరు.... ఆమె అక్కణ్నించి లేచి, అంత నీరసంలోనూ వెర్రిగా పరుగెత్తింది. ఆమె తల్లి చావుబతుకుల్లో వుంది. ఆ ఆలోచనామె మనస్సు నిప్పటికే చిత్రవధ చేసి పక్కనే నిలబడి చిత్రంగా చూస్తోంది.

కాసేపయ్యాక,నాగులు పరిగెత్తలేక మెల్లిగానడుస్తూ వస్తోంది. అప్పుడు దైన్యానిక, విచారానికీ మరో పేరైన నాగుల్ని దేవుడు చూసే దంటారా?

దేవుఁడి మాట తెలీదు కానీ, గురువులు మాత్రం చూసేడు.

గురువులంటే చిన్న కేడీగాళ్ళకి గురువులే! వాళ్ళో కొత్తపిట్టొస్తే, అది గురువులు చేతిలో వాలకుండా ఎక్కడికీ ఎగర్లేదు. అతనే ఆ పిట్టల్ని తనిష్టం వచ్చినోచ్చోటుకి తీసుకువెళతాడు. ప్రతిఫలాన్ని తీసుకుంటాడు. లేపోతే తన్ని లాక్కుంటాడు. అతను బ్రోకర్లకి రారాజు.- రౌడీలకి తలమానికం. ఆకారానికి 'జానపద విలన్!'. వూరికి 'నల్లటి వెలుగు!'

అప్పుడు గురువులు నాగుల్నిచూసి, "ఏం పిల్లా? ఏటి కథ?" అనడిగేడు.

రోడ్డంతా దాదాపు ఖాళీగావుంది. అందువల్ల నాగులికొంచెం భయం ఇంకా ఎక్కువ గాభరా, విచారంకూడా వేసేయి. అప్పుడామె కథంతా చెప్పి, "ఐదు రూపాయల్లేకపోతే మాయమ్మ బతకదు." అని కలిపింది.

"ఐదేనా? ఐనా చికాకేనే! మర్నువ్వేమైనా చెయ్యగలవా?" అనడిగేడు గురువులు.

"చేస్తాను." అంది నాగులు గురువులి పక్క అశగా చూసి, "ఏమైనా చేస్తాను. మాయమ్మకోసం, దాని పేనంకోసం, సత్తెపెమానంగా "ఏమైనా చేస్తాను". ఆ మాట తర్వాతామెకు మాటల్రాలేదు. కన్నీళ్లూ ఎక్కిళ్ళు వొచ్చేయి.

"నాతోరా." అన్నాడు గురూలు బీడీ వెలిగించి.

* * *

మైడియర్ ఎస్టీమ్డ్ మెంబర్సాఫ్‌ది సివిలైజ్‌డ్ సొసైటీ! ఐదు రూపాయలు మీకో పెద్ద లెఖ్ఖ కాకపోవచ్చు. ఎలాగైనా మీరు సంపాదించొచ్చు. లేకపోతే "వెధవైదు రూపాయలు.... నాకో పూట సిగరెట్లు" అనీచ్చు.

కాని.... అదే ఐదు రూపాయలకోసం, ఆ పద్దెందేళ్ళమ్మాయి, కన్నీళ్ళింకిన కళ్ళతో, విచారం ఎక్కువై పోయి, ఏపీ దారీ, తెన్నూ, దిక్కూమొక్కూ తోచకపోతే అన్నిటికీ తెగించి జీవితంలో మొదటిసారి శీలాన్నమ్మి, కళ్ళమూసొ్కని, దేవుణ్ణి తల్చుకొని, ఏడుస్తూ అరుస్తున్న మనసు చుట్టూ అమ్మకోసం చేస్తున్న త్యాగపు పొరనడ్డువేసి. అప్పుడే అర గంట క్రితం ఓడ దిగిన 'దొర' కోసం యేం చేసిందో చెప్తే, మీరు నమ్ముతారా?

మీరు నమ్మకపోవచ్చు. ఐదు రూపాయలకోసం, మనుషులంత వెధవపని "చెయ్యలేర్సార్" అని మీరంటారు.

కాని.........,

నాగులంతపనీ చేసింది. వొళ్ళమ్మ ప్రాణంకోసం ఒళ్ళమ్మింది....

వొళ్ళమ్మగా వచ్చిన డబ్బులో గురువులు ఐదు రూపాయలు మాత్రమే, ఆమె చేతిలోపెట్టేక, ఆ నోటు నడుందగ్గిర దోపుకొని, నాగులు మందుల్షాపు వేపు లేని వోపిక తెచ్చుకొని, కళ్ళలో వెలుగు నింపుకుని— పరిగెత్తింది.

"బాబూ! సూదిమందు. ఐదు రూపాయల్ది." అంది వొగరుస్తూ.

"చీటీ యేదీ?" అన్నాడు షాపాయన.

నాగులు డాక్టరుబాబిచ్చిన చీటి నడుంకి ఎడంపక్క ముళ్లోంచి తీసిచ్చింది.

"ఐదు రూపాయలే" అన్నాడు షాపాయన.

"ఔను బాబూ, తెచ్చినాను" అంటూ నడుంకి కుడిపక్క కోకముడి కాడ తడువుకుంది నాగులు....

అయ్యో, అమ్మో, ఇది ఘోరాలన్నిట్లోనూ ఘోరం. ఇది విధి చేసిన మోసాలన్నిట్లో మోసం....

ఇది మనిషి బతుక్కీ చావుకీ మధ్య తేడా లేని....

మన చుట్టూ వుండి, మనం చూడలేని జీవితాల వెనక - జీమూతాల రాగం....

నాగులికళ్ళు తిరిగేయి. ఇంతసేపూ తోడుగావున్న వోపిక ఎగిరిపోయింది. ఐదు రూపాయిల్నోటు అక్కళ్లేదు.

"యేవైంది? యేవో!"

భూమంతా బద్దలైనట్టయింది. కళ్ళు లోతుకి దిగిపోయినట్టూ వాటికి బదులు రెండగ్ని గోళాలు వెలిగినట్టూ ఐంది.

"బాబూ, డబ్బు పోనాది." అంది షాపాయన్తో వొణుకుతూ నాగులు....

"ఆహాఁ, నువ్వూపో. ఇక్కడ వూరికే మందులివ్వరు." అన్నాడు షాపాయన.

నాగులు బలవంతంగా వెనక్కి తిరిగింది. యేం చెయ్యాలో తెలీలేదామెకి. ఒక్కసారిగా ఆమె మనసులో - కోపం, ఏడుపు, జాలి, ఆశ్చర్యం, భయం - ఇవన్నీ కలిసి పొంగేయి. అందువల్లామె మొహం వర్ణనకతీతంగా - అదేదో వింత లోకంలో, కష్టం - సుఖం - రెండూ తెలియని ప్రాణి మొహంలా వుంది.

ఆ అవస్థలో, ఆమె పుట్‌పాత్‌దాకా మాత్రం నడవగలిగింది. మళ్ళీ ఎందుకో ఒక్కసారి మనసులోపల యేదో పెద్ద విషపు సముద్రం పొంగినట్టయింది, కళ్ళలో కెవరో కాలకూటంలో ముంచిన నిప్పురవ్వలు

విసిరినట్టయింది. మనసులో నెవరో నిప్పుల పిడికిలితో నలిపినట్టయింది. నాగులు ఫుట్‌పాత్ దాటలేక అక్కడే పడిపోయింది.

ఓ పావుగంట పోయేక అటొచ్చిన కానిస్టేబిల్ ఫుట్‌పాత్‌మీద పడున్న 'ముష్టిముండ'ని తట్టి లేపాడు. చాలా కోపంగా కసిరి. విధుల్ని తిట్లతోబాటు చెప్పేడతను. చెప్పి దూరంగా "ఫో ముండా" అని తిగిలి పేడు.

అప్పుడా ఆకారం సగం బతికిన శవంలా మెల్లిగా, అతి మెల్లగా నడవడం మొదలుపెట్టింది.... ఆ నడక, బలవంతంగా బండరాళ్ళు మోస్తున్న బక్కచిక్కినవాడి నడకలావుందేకాని, పూర్తి ప్రాణంవున్న నడకలా లేనేలేదు.

అప్పుడు, ఆ కళ్ళల్లోంచి రోడ్డుమీదికి జారిన కన్నీటిబొట్లని కానిస్టేబులు చూళ్లేదు. చూస్తే, అతనూ జాలిపడున్న మరి.

*　　　*　　　*

ఐస్‌క్రీంలకీ ఐ. సి. ఐ. బెర్లిన్లకీ, మధ్య అతి గారాబంగా పెరిగిన ప్రభాకర్రావ్ బహద్దూర్‌కి, వాళ్ళ డాడీ మీద్చాలాకోపంవచ్చింది.

"వెధవది.... సినిమా కిన్నైదు రూపాయలడుగుతే, ఈ నెల్లో ఇప్పటికే నాలుగొందలు తిగలేసినందుకల్ల ఇక కానీకూడా "ఇవ్వనుగాక ఇవ్వను" అని ఆయనెందుకనాలి? వెధవ నాలుగొందలు .... అన్నానే కాని, ఇప్పుడు సినిమాకు డబ్బులేవు.... గోల్డుఫ్లేక్కి డబ్బుల్లేవు. లిల్లీ బర్త్‌డే ప్రెజంట్‌కి డబ్బుల్లేవు. మరి దేనికీ లేవు.... డాడీ తిట్లూ, ఖాళీ సిగరెట్టు పెట్టి మిగిలేయి.... పోనీ, ఓ ఐదున్నా బావుణ్నుకనీసం........ రేపెవణ్ణో మళ్ళీ అడగొచ్చు, అని చాలా గాభరాగా ఆలోచించి, బైటికొచ్చి నడవడం ప్రారంభించేడతను. మరి డాడీనిమాత్రం అడగదల్చుకోలేదతను.... జమీందారీ రక్తం మరి.

అలా బుర్రరొంచుకొని ఆలోచిస్తూ 'చాలా పెద్ద కష్టం'లో పడ్డ ప్రభాకర్రావ్ బహద్దూర్ కళ్ళొక్కసారి మెరిసేయి. అలా మెరిపించిన కారణాన్ని దగ్గరగావెళ్ళి ఒంగిచూసి, ఔనో, కాదోనని గిల్లుకుని చూసేడు.

"నిజమేసార్, కలకాదు, నిజమే ఇది."

అల్లా మందుల్షాపుకి పదడుగులముందు దూరమే అయుంటుంది. అక్కడ ఫుట్‌పాత్ వార, ఐదు రూపాయలనోటు - లల్లీ నవ్వంత అందంగా మెరిసింది.

ప్రభాకర్రావ్ బహదూర్ గబగబా మళ్ళీ వొంగి, చుట్టూచూసి, ఎవరూ చూళ్లేదని తెలుసుకుని, ఆ నోటు నతి ఆనందంగా అందుకున్నాడు.

సర్స్, ఆ నోటు మనవందుకున్నట్టయితే .... అది, పద్దెందేళ్ళ ఆడపడుచు పదిలంగా దాచి, అమ్మ ప్రాణంకోసం - అతి గొప్ప విలువైన త్యాగ ఫలింగా శీలం, మానం, ఆత్మ, రక్తం - ఇవన్నీ అమ్మినంత బరువూ (శ్రీకృష్ణ తులాభారం తెల్సా మీకు? అంత బరువు) ఉండొచ్చు. కాని ప్రభాకర్రావు బహద్దూర్ కది, లల్లీ స్పర్శలా తేలిగ్గానూ, లల్లీ చూపులా చాలా అందంగానూ కనిపించింది....

అప్పుడతనాడబ్బుతో యేంచేసేడంటారు? సినిమాకే వెళ్లేడా? నాలుగ్గోల్డుఫ్లేక్ పెట్టెలే కొన్నాడా? లల్లీబర్తుడే ప్రెజంట్‌కోసం 'మొరావియా' పుస్తకమే కొన్నాడా?....

"యేమో తెలీదంటారా! నిజమే! ఇటీజ్ లెఫ్ట్ ఫర్ హిజ్ డెసిషన్.... అత నిష్టం వచ్చినట్లు చేస్తాడు. ఆ నోటతని సొంతం. ఐనా యేం చెయ్యాడనో నిర్ణయించకపోయినా, అతనా, నోటు నతిభద్రంగా జేబులో వేసుకుని ఈలవేస్తూ లల్లీని తల్చుకుంటూ - సంతోషంగా నడవడం ప్రారంభించేడు.

* * *

మనూరి చివర దేవేంద్రభవనంలాటి మేడలమధ్య, నాలుగో వరసలో తొమ్మిదో గుడిసెకాబోలు.... చాలా నిశ్శబ్దంగావుంది. ఆ నిశ్శబ్దం సమాధిలా చాలా భయంకరంగావుంది. యుద్ధమైపోయిన్తరువాత యుద్ధ భూమిలో నిశ్శబ్దంలా, అతిఘోరంగా, నిశ్శబ్దంగా చావుచేసిన వికటాట్టహసంలావుంది.

అయ్యో! అమ్మా! ఎక్స్‌క్యూజ్‌మీ! ఇప్పటికే మిమ్మల్ని చాలా బాధపెట్టేను. ఐనా సరే! ప్లీజ్! కొంచెం ఓపిక పట్టి అలా చూడండి....

లోపలంతా ఇందాకట్లాగేవుంది....నల్లని గోడలూ, నల్లని నేలా, అంత నల్లగాలేని దేవుడి విగ్రహం, ఓమూల ఒకటో, రెండో సిల్వరు గిన్నెలూ, బోలెడు ధూళి. కిందగా మంచంమీద మానవాకారం....కాని ఆ కళ్ళు ఇందాకట్లాగ సగం తెరిచిచూడాలేవు. పూర్తిగా మూసుకొని ఉన్నాయి.

మంచం చివరమాత్రం, ఆ పద్దెందేళ్ళమ్మాయి, తలవాల్చి పడుంది. మీరు జాగ్రత్తగా చూస్తే, ఆమె కళ్ళలో నీళ్ళులేవు. మొహంలో ఏ భావంలేదు....ఒక చెయ్యి మాత్రం దూరంగా జరిగి, వాళ్ళమ్మ గుండెలమీద పడి, ఆ గుండెల్ని, ఎగిరిపోకుండా ప్రాణాల్ని జాగ్రత్తగా, అతి జాగ్రత్తగా పట్టుకున్నట్టుంది.

మరేదో మార్పు....గుడిసె కప్పుల కన్నాల్లోంచి వెన్నెలజారి గూట్లోవున్న విగ్రహం మీద పడ్డంవల్ల—ఆ విగ్రహంపు నీడ నాగులు చేతిమీద, వాళ్ళమ్మ గుండెలమీదా కలిపి పడుతోంది. ఆ నీడ చాలా అందంగా వున్నా, వొంకలు తిరిగినందువల్ల, కాస్త వికృతంగా వుంది ...

గదినిండా, అదో రకం వాసన—సగం కాలి మానేసిన శవాల వాసన వేస్తోంది. అంతా అతి గ్లూమీగా వుంది. కాస్త వెన్నెలైనా పడ్డం వల్ల అదంతా—షిప దొరలు భారతీయ సంస్కృతికోసం సరదాపడి వాళ్ళ కెమేరాల మధ్య బంధించిన ఫోటోలా వుందేకాని, అక్కడ జీవం ఉన్నట్టేలేదు....అంతా వెను భీకరంగా వుంది.

మరి కాస్సేపోయాక, పెద్ద పెట్టున వర్షం మొదలైంది. (మీరింక వెళ్ళిపోవచ్చు....హాయిగా భోంచేసి, సిగరెట్టు ముట్టించి, ఇవన్నీ మరిచిపోయి, జాలీగా 'కార్టర్ బ్రౌనో' 'మావగారి కథలో' చదువుకోవచ్చు. థాంక్యూ ఫర్ యువర్ కర్టెసీ, సర్ మేడం!) అందు వల్ల కప్పులు చాలా గట్టిగా శబ్దం చేస్తున్నాయి. ఒక్కసారిగా, పెద్ద గాలి వేస్తూండడంవల్ల, ఆ దేవుడి విగ్రహం చాలాసేపు వూగింది.

అప్పుడు వాళ్ళిద్దరిమీద నీడ కూడా చెట్టు కొమ్మలాగా మీ మనసులాగా వూగింది. ఆ సీను చాలా భయంకరంగానూ, ఒక రకం ఆర్టిస్టిక్ చూస్తున్నవాళ్ళ కళ్ళకి అందంగానూ వుంది.

అదంతా, నిర్నిమీష నేత్రాల్ని, వెనుకోరల్నీ తెరుచుకున్న చావు నీడలా వుంది....

అదంతా మనుషుల్ని మట్టిలోనే తిరిగి కలిపేయటాని కొచ్చిన ప్రళయపు గోడలా వుంది.

అదంతా దేవుడి గుండెల్లోపల 'ఎబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్' కి సంబంధించిన నరకపు జాడలావుంది....

అదంతా వర్ణనకతీతంగా వుంది....

మరి కాస్సేపొయ్యాక, చాలాసేపు వూగిన విగ్రహం కిందపడి పగిలింది... అందువల్ల నాగులు మీదా, వాళ్ళమ్మ మీదా పడ్డ నీడకదిలి చెదిరి, ఆఖరికి మాయమైపోయింది. పగిలిన విగ్రహపు ముక్కలు అటూ, ఇటూ చెదరిపోయేయి. ఇదివరకు వెలిగిన వెన్నెలని, మబ్బులు కమ్మేయటంవల్ల —అంతా పెను చీకటి కమ్ముకుంది....

గుడిసెపై నున్న కమ్మలమీద వర్షం చేస్తున్న చప్పుడు, మనిషిని చూసి, మృత్యువు నవ్వినట్టుంది.